తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం | పేజీలు : 08
6 జూలై 2025





## రూ.19 లక్షలతో సివరేజ్ అభివృద్ధి పనులు

**రాజేంద్రనగర్, జూలై 5 (జనం సాక్షి) :** నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందు లు తలెత్తకుండా సమస్యలు లేనివిధంగా అభివృద్ధి పనులు జరిపిస్తున్నానని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ పేర్కొన్నా రు. శనివారంరూ. 19 లక్షలతో (సీవరేజ్ పైప్‌లైన్) అభివృద్ధి పనులను రాజేంద్ర నగర్ విశ్వన్‌నగర్ కాలనీ హైదర్ ఎన్‌క్లేవ్ లో స్థానిక కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వికార్ అహ్మద్, సయ్యద్ బూరాన్ ముక్రం, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.





# కైదమ్మకుంట చెరువు సుందరీకరణకు అరికెపూడి సంకల్పం

## శేరిలింగంపల్లిలో పర్యావరణ పునరుజ్జీవనానికి రాజీలేని కృషి



**శేరిలింగంపల్లి, జులై 05 (జనంసాక్షి):**

శేరిలింగంపల్లి హాఫీజ్పేట్ డివిజన్‌లోని కైదమ్మకుంట చెరువు సుందరీకరణ కోసం రాజీలేని పోరాటం చేస్తూ ముందుకు సాగుతానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ తెలిపారు. నెక్సస్ సెలెక్ట్ మాల్స్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో, శనివారం అరికెపూడి గాంధీ ఇరిగేషన్, రెవెన్యూ, జలమండలి అధికారులతో కలిసి పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కైదమ్మకుంట చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం భాగస్వామ్యంతో పర్యావరణ పురోగతికి ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్ సహజ వనరులను పునరుజ్జీవనం చేయడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా సుస్థిర అభివృద్ధికి మార్గదర్శకంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గతంలో మురికి కూపంగా మారిన ఈ చెరువు, సుందరీకరణ పనుల ద్వారా స్వచ్ఛమైన నీటి చెరువుగా మారుతుందని, చుట్టూ చెట్లు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తామని ఆయన తెలిపారు. నెక్సస్ సెలెక్ట్ మాల్స్ సామాజిక బాధ్యతను గుర్తించి ముందుకు రావడం అభినందనీయమని, సమాజ సేవ కోసం అందరూ తమ బాధ్యతను గుర్తించాలని గాంధీ కోరారు. చెరువు పునరుద్ధరణ, సంరక్షణ, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆయన హామీ ఇచ్చారు. చెరువు కట్టను బలోపేతం చేయడం, మురుగునీరు చెరువులో కలవకుండా కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మత్తులు, వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ వంటి పనులు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. చెరువు అపరిశుభ్రత వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న దోమల సమస్య, అనారోగ్య ఇబ్బందులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు గాంధీ తెలిపారు. చెరువుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మానవ మనుగడ చెరువుల మనుగడతో ముడిపడి ఉందని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఈ నలిని, ఏఈ పావని, రెవెన్యూ అధికారులు, సర్వేర్ జగదీష్, జలమండలి మేనేజర్ శ్రీహరి, సిఎస్ఆర్ ఐటి సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

### సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్



**హయత్ నగర్, జులై 05 (జనం సాక్షి) :** జూలై 9న జరిగే సమ్మెకు వలస కార్మికులందరూ పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ పిలుపు. ఆటోనగర్ లోని టిసిఐ ఫైట్ ఇండియా లిమిటెడ్ గ్రేట్ మీటింగ్ కు సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి లు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 9న జరిగే సమ్మెకు వలస కార్మికులందరూ పాల్గొనాలని వారు పిలుపు ను ఇచ్చారు. అనేక సంవత్సరాల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం వాటిని రద్దు చేసి కార్మికు లను యాజమాన్యా లకు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు, వివిధ కార్మిక సంఘాలు జులై 9న జరిగే సమ్మెలో కార్మిక వర్గం పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, కాంట్రాక్ట్,

➤ మిగతా 2లో..



## త్యాగానికి ప్రతీక మొహర్రం

### రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ గురునాథ్ రెడ్డి

**కొడంగల్ జూలై 05 (జనం సాక్షి):** త్యాగానికి ప్రతీక మొహర్రం అని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ గురునాథ్ రెడ్డి అన్నారు. శనివారం మొహర్రం సందర్భంగా కొడంగల్ పట్టణ కేంద్రంలో జామే మస్జీద్ దగ్గర గల పీర్ల మసీదు లో ప్రతిష్టించిన బీబీ ఫాతిమా అలీ అబ్బాస్, ఇమామ్ ఖాసీమ్ పీర్లకు పూలు దట్టి సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎం.గౌసన్, వాహేద్ రజ, అబ్దుల్ సత్తార్, రహమాత్ ఖాన్, అమిర్ ఖాన్, సయ్యద్ మునీర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




## గ్లోబల్ విజన్ ప్రచారాన్ని ఆవిష్కరించిన సేవ్ ఎర్త్ మిషన్

**ఖైరతాబాద్ , జులై 05 (జనం సాక్షి) :**

ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పర్యావరణ ఉద్యమం సేవ్ ఎర్త్ మిషన్ తన గ్లోబల్ విజన్ ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించి నట్లు సేవ్ ఎర్త్ మిషన్ ఇండియా అధ్యక్షుడు సందీప్ చౌదరి శనివారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేట్ వ్యవహారాల అంతర్జా తీయ సలహాదారు డా.అజయ్ దేశాయ్ తో కలసి ఆయన మాట్లాడుతూ ఈ బహుళ దేశాల ప్రచారం లక్షలాది మందిని చెట్లను నాటడం, పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం, నికర సున్నా భవిష్యత్తును నిర్మించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.



## జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ ప్రారంభించిన పుల్లెల గోపీచంద్

**ఖైరతాబాద్ , జూలై 5 (జనం సాక్షి) :** యువతలో క్రీడాస్ఫూర్తిని, జాతీయ సమైక్యతను పెంపొందిం చాలనే లక్ష్యంతో హైదరాబాద్‌కు చెందిన ది గాడి యం స్కూల్ 'జిమ్‌క్విన్' రెండో ఎడిషన్‌ను శనివా రం ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ చేతుల మీదుగా ప్రారంభించినట్లు స్కూల్ డైరెక్టర్ కె.కీర్తి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ జాతీయ స్థాయి జిమ్నాస్టి క్స్ ఈవెంట్‌లో దేశంలోని 15 రాష్ట్రాల నుంచి 850 మంది యువ జిమ్నాస్ట్‌లు పాల్గొంటారని తెలిపా రు. గాడియం స్కూల్ నుంచి 107 మంది విద్యార్థు లు తమ ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. భారత సైన్యానికి చెందిన కల్నల్ కమలేష్ మిశ్రా, పోలీసు సూపరింటెండెంట్(ఇంటెలిజెన్స్) శిరీష రాఘవేంద్ర హాజరై జిమ్నాస్ట్‌లను అభినందించారు .

## విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంపొందించాలి : ప్రిన్సిపల్ వాణి ప్రసాద్



**శేరిలింగంపల్లి, జూలై 05 (జనంసాక్షి) :** నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, విద్యార్థి దశలోనే వారిలో సామాజిక బాధ్యత కోణాన్ని వెలికి తీయగలిగితే భవిష్యత్తులో దేశ భవితకు ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు పరిపూర్ణ అవకాశం లభిస్తుందని శేర్లింగంపల్లి శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ వాణి ప్రసాద్ పేర్కొన్నా రు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో 'స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం – గ్రీన్ ఇండియా మిషన్' పేరుతో పర్యావరణ ఆవశ్యకతను తెలియజేసేలా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులచే ఉపాధ్యాయులు పలు మొక్కలను నాటించడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరంలో బోధనాంశాలతోపాటు సహ పాఠ్య ప్రణాళికలను కూడా తమ పాఠశాలలో చక్కగా వినియోగించడం జరుగుతుందని, ఇందులో భాగంగానే పర్యావరణం యొక్క ప్రాముఖ్యత తెలిసేలా, భవిష్యత్తులో దానిని ప్రతి విద్యార్థి తప్పకుండా ఆచరణలో వినియోగించేలా 'స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం – గ్రీన్ ఇండియా మిషన్' పేరుతో పర్యావరణంపట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించు కోవడానికి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ హననంతో పెనుముప్పు పొంచి ఉంద ని, మానవాళి మనుగడనే ప్రశ్నార్థకంగా మారే దుస్థితి నెలకొందని ప్రిన్సిపాల్ వాణి ప్రసాద్ అన్నారు. మనిషి మనుగడ ప్రకృతి తోనే సాధ్యమని, ప్రకృతి విధ్వంసం పరోక్షంగా మనిషి వినాశనానికి కారణ భూతమవుతుందని ఆమె తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భయంకర మైన స్థాయిలో కాలుష్యం పెరిగిపోయి గ్లోబల్ వార్మింగ్ పరిస్థితులు నెలకొన్నాయని, తద్వారా ఇప్పటికే ఎన్నో జాతీయ అంతర్జాతీయ విపత్తులు తలెత్తుతూ సామాజిక స్థితిగతులను తెలియజేస్తున్నప్పటికీ పారిశ్రామికీకరణ, అభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పేరుతో అనేక రీతులలో ప్రకృతికి విఘాతం కల్పిస్తున్న మనిషి నేడు పతనం అంచున నిలబడి తన ఉనికినే కోల్పోయే దుస్థితికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇప్పటికే పరిస్థితులు చేయి జారిపోయాయని, కనీసం ఇకనుండి అయినా మేల్కొని ప్రకృతిని పరిరక్షించుకోవాలని, పర్యావరణాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని వాణి ప్రసాద్ సూచించారు.

ప్రపంచ దేశాలు, అందులో భాగమైన భారతదేశంలో సైతం ప్రతి ఒక్కరూ తమ కనీస బాధ్యతగా వీలైనంత మొక్కలు నాటి అడవుల శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందని, ప్రకృతిని ఎంత పెంపొందించుకుంటే అంత పర్యావరణ కాలుష్యం తగ్గిపోయి భవిష్యత్తు మనుగడ ముందుకు సాగుతుందన్నారు. పర్యావరణ కాలుష్యానికి వాతావరణం లోకి విడుదలయ్యే గ్రీన్ గ్యాసెస్, కర్బన సంబంధ వాయువులు ఒక కారణమైతే, ప్లాస్టిక్ వినియోగం సైతం పర్యావరణ హననానికి ప్రథమ కారణంగా నిలుస్తుందని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించిన రోజున ప్రపంచం మళ్లీ పచ్చదనంతో చిగురించి మనిషి మనగడకు కావలసిన పరిస్థితులు అభివృద్ధి చెందడానికి ఆస్కారం లభిస్తుంది అన్నారు. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటే విధంగా, పచ్చదనాన్ని పెంపొందించేలా స్థానిక పరిసరాలలో విద్యార్థులచే ర్యాలీలను నిర్వహించి ఆయా ప్రాంత వాసులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎం శివరామకృష్ణ, ప్రాంతీయ ఇన్చార్జ్ పద్మజ, కోఆర్డినేటర్ వెంకట శివ, పాఠశాల డీన్ రాజేష్, ప్రైమరీ ఇన్చార్జి విభాగం మాధవి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హయత్ నగర్ సిడిపిఓ సుజాత కి సిఐటియు ఆధ్వర్యం లో సమ్మె నోటీసు

**హయత్ నగర్, జూలై 05 (జనం సాక్షి)** హయత్ నగర్ అంగన్వాడీ ప్రాజెక్ట్ సిడిపిఓ సుజాత కు రంగారెడ్డి జిల్లా సిఐటియు సహాయ కార్యదర్శి మల్లెపాక వీరయ్య, అంగన్వాడి వర్కర్లతో కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 9 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు స్వాతంత్ర ఫెడరేషన్ అసోసియేషన్ల జాయింట్ ప్లాట్ ఫామ్ ఆ ట్రేడ్ యూనియన్స్ పిలుపులో భాగంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు కూడా పాల్గొంటుందని వారు పిలుపునిచ్చారు.

కేంద్రం లో బిజెపి అధికారం లోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం అనేక త్యాగాలు పోరాటలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్లను తీసుకొచ్చి వాటి అమలు కోసం కేంద్ర బిజెపి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నాలుగు కోడ్ తీసుకురావడం వల్ల కార్మిక సంఘాల ఏర్పాటుకు కష్టతరమవుతుం దని, ఉద్యోగ భద్రత ఉపాధి కోల్పోవడం కార్మిక శాఖ నుండి నిర్వీర్యం చేయబడుతుంది దీనితో అంగన్వాడి టీచర్స్, వెల్ పర్స్ మినీ టీచర్స్ సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం చేయకుండా కేంద్ర ప్రభుత్వం అంగన్వాడి లకు మోసం చేస్తుందని వారు అన్నారు. 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి,

అంగన్వాడీ లకు కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావాలి, అంగన్వాడీలను పర్మినెంట్ చేసి హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా టీచర్లకు, హెల్పర్లు కు గ్రాడ్యూటీ పైన సుప్రీంకోర్టు ఆదేశాలను తక్షణం అమలు చేయాలి, ఏ రూపంలో నైనా ఐసిడిఎస్ ప్రైవేటీకరణ చేయరాదు, ఐసిడిఓలో కార్పొరేట్ ప్రమేయం నగదు బదిలీ పిఎం మొబైల్ అంగన్వాడి సెంటర్స్ నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు అన్నారు. అంగన్వాడీ లను అన్ని రకాలుగా బలహీనపరిచి, అంగన్వాడి సెంటర్ ని ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ, అంగన్వాడి వర్కర్స్ గంగమ్మ, సుకన్య, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.



## ఆలయానికి మైక్ సెట్ వితరణ

**తలకొండపల్లి జూలై 05(జనంసాక్షి):** మండలంలోని రాంపూర్ గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి,ఆలయ కమిటీ చైర్మన్ జిల్లెల్ల పవన్ కుమార్ రెడ్డి,ఆలయ కమిటీ డైరెక్టర్ ముక్తాల స్వామి గౌడ్,లు తమ సొంత నిధులు రూ,40 వేలు ఖర్చు చేసి 3 మైకులు,సౌండ్ సిస్టంను ఆలయానికి అందజేశారు.మైక్ సెట్ ను అందజేసిన దాతలను గ్రామస్తులు అభినందించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..పురాతనమైన ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిక్కల యాదయ్య,ఎన్నం రాజు,సుదర్శన్ రెడ్డి, నరసింహా అయ్యగారు,కాకి వినోద్,సాయి తేజ,శేఖర్,యశ్వంత్,తదితరులు ఉన్నారు.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రావు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

**ఉప్పల్ జూలై 05 ( జనం సాక్షి):** దేశ సామాజిక న్యాయం సాధనకు గొప్ప కృషి చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రావు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం హబ్సిగూడ చౌరస్తాలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించి న బాబు జగ్జీవన్ రావు విగ్రహా ఆవిష్కరణ లో పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీస్ అధినేత మంద కృష్ణ మాదిగతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం మర్చి పోలేనిది అని ఎమ్మెల్యే అన్నారు.

## బిజెపి కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

అవుట్ సోర్సింగ్, ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్మెంట్, అప్రెంటిస్షు, ట్రైనీలు వంటి రూపాలలో వివిధ పథకాల కింద పనిచేస్తున్న కార్మికులు ఎవరిని చేయరాదని, కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికు లతో సహ అన్ని తరగతుల కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి, ఎన్పీఎస్ మరియు యుపిఎస్లను రద్దు చేయాలి, బోనస్ ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపు, అర్హతలపై అన్ని సీలింగ్ లను తొలగించాలి, గ్రాట్యుటీ మొత్తాన్ని పెంచాలి, యూనియన్ కొరకు దరఖాస్తు చేసుకున్న 45 రోజుల వ్యవధిలో కార్మిక సంఘాలు తప్పనిసరి రిజిస్టర్ చెయ్యాలి, ఐఎల్ఓ సమావేశాలు సీ87, సి98లను తక్షణమే ఆమోదించాలి, ధరల పెరుగుదలను నియంత్రించి ఆహారం, మందులు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, యంత్రాల వంటి ముఖ్యమైన వస్తువులను జిఎస్టి పరిధి నుండి తొలగించాలి, పెట్రోలియం ఉత్పత్తులు, వంటగ్యాసు లపై సెంట్రల్ ఎక్సైంజ్ పన్నును గణనీయంగా తగ్గించాలి, ఆహార భద్రత చట్టానికి హామీ ఇవ్వాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను సరళవంతం చేయాలని వారు డిమాండ్ చేస్తూ, సార్వత్రిక సమ్మెలో కార్మిక, కర్షక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని, కార్మిక వర్గానికివారు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ సహకార సంఘుల దినోత్సవం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సబ్జీమండి ప్రాథమిక మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ సహకార సంఘుల దినోత్సవం సందర్భంగా గంగపుత్ర సంఘం నందు జెండావందన కార్యక్రమం నిర్వహించారు. గంగపుత్ర సంఘం అధ్యక్షులు దొర్లుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆనందేసి వేణుబాబు, గంగపుత్ర మహిళా సంఘం అధ్యక్షులు కుడుముల స్వాతి, ప్రధాన కార్యదర్శి బాధ లావణ్య, మత్స్య మహిళ పారిశ్రామిక సహకార సంఘం సబ్జీమండి అధ్యక్షులు కుడుముల రేఖ, ప్రధాన కార్యదర్శి గుడుమణి విద్య, మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘం సబ్జీమండి అధ్యక్షులు గుడుమని తిరుమలానంద, ప్రధాన కార్యదర్శి కట్ట సుబ్రహ్మణ్యం, మత్స్య మహిళ పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘం జియాగూడ అధ్యక్షులు చెర్ల రాజశ్రీ, ప్రధాన కార్యదర్శి గూడబోయిన దీపిక, మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘం జియాగూడ అధ్యక్షులు చాట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్ పాల్గొనగా.. ప్రాథమిక మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కట్ట లింగం, ప్రధాన కార్యదర్శి మురారి రాంబాబు, ఉపాధ్యక్షులు మంగలి పల్లి బాల నరసింహ, కోశాధికారి చెర్లబాబు, కార్యవర్గ సభ్యులు విజయవంతం చేశారు.

## భక్తిశ్రద్ధలతో మొహరం సంతాప దినాలు

### రూ.5,500 విరాళాన్ని అందజేసిన మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్



**తలకొండపల్లి జూలై 05(జనంసాక్షి):** హిందూ ముస్లింలు ఐకమత్యంతో మెలిగి మొహరం పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని తలకొండపల్లి మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండ లంలోని వెల్జాల్ గ్రామంలో భక్తిశ్రద్ధల తో మొహరం సంతాపదినాలు కొన సాగుతున్నాయి. మొహరం సంతాపదినాలలో భాగంగా 9వ రోజు కులమతాలకతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పీర్లకు తమ మొక్కుబడులను చెల్లించుకుంటున్నారు.వెల్జాల్ గ్రామంలోని పీర్లచావిడి లో నిర్వాహకులు పీర్లను ప్రతిష్టించి ఫాతేహాలు చేస్తున్నారు.ఈ సందర్భంగా శనివారం తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నా.పీర్లు ప్రతిష్టించే (ముజావర్)నిర్వాహకులకు రూ,5500,లు విరాళాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జడ్పీ కో ఆప్షన్ మూజీబూర్ రహేమాన్, మాజీ ఉప సర్పంచ్ ఇస్తాని, మోహన్ లాల్,గులాం హుస్సేన్, సంధాని, జిలాని, తదితరులు పాల్గొన్నారు.

## నూతన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి జిల్లా ప్రధాన కార్యదర్శి సన్మానం



**రాజేంద్రనగర్,జూలై5(జనం సాక్షి) :** రాష్ట్ర నూతన బిజెపి అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎన్. రామచంద్ర రావు శనివారం చార్మినార్ వద్ద భాగ్య లక్ష్మి దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఆ తర్వాత తెలంగాణ అమరవీరుల స్థూపం గన్ పార్క్ వద్దనుండి ర్యాలీగా బయలుదేరారు. అనంతరం ఆయన్ను రాజేంద్రనగర్కు చెందిన అర్బన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్ ఆయన్ను కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎర్రోళ్ల ఆనంద్

**సింగాపురంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శ్రమదానం, ఆర్థిక సహాయం**

**శంకర్‌పల్లి, జులై 05 (జనంసాక్షి):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం కాంగ్రెస్ నాయకుడు, సామాజిక కార్యకర్త, న్యాయవాది ఎర్రోళ్ల ఆనంద్ ఒక రోజు శ్రమదానం చేసి, లబ్ధిదారులైన స్టేషన్ల లక్ష్మి, మాణయ్య దంపతులకు తన వంతు సహాయంగా రూ.10,000 అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూడు, గుడ్డతో పాటు గూడు ప్రతి మనిషికి అవసరమని, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాంతి కుమార్, సుదర్శన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరిస్టాటిల్ పీజీ కాలేజీలో విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



**మొయినాబాద్ జూలై 05, జనం సాక్షి :**
ఆరిస్టాటిల్ పీజీ కాలేజీలో పీజీ చివరి సంవత్సరం విద్యార్థుల కోసం జూనియర్ విద్యార్థులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమంను నిర్వహించారు. జులై 5, 2025న జరిగిన ఈ కార్యక్రమం స్నేహం, గుర్తులు, ఆత్మీయతతో నిండి, జూనియర్లు తమ సీనియర్లకు గుర్తుండిపోయే విధంగా జరిపారు. క్యాంపస్ మొత్తం రంగులద్దినట్టుగా అలంకరించబడింది. జూనియర్ విద్యార్థులు సీనియర్లను హార్దికంగా ఆహ్వానిస్తూ, మధురమైన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటలు, ర్యాంప్ వాక్ తదితర వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా కె జి రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల నుండి ప్రముఖులు హాజరయ్యారు: డా. సాయి సత్యనారాయణ రెడ్డి , ప్రిన్సిపాల్, డా. నర్సయ్య , వైస్ ప్రిన్సిపాల్, కళాశాల నుండి వివిధ విభాగాల హెడ్‌లు డా. సాయి సత్యనారాయణ రెడ్డి విద్యార్థులకు ప్రేరణాత్మకంగా మాట్లాడుతూ, విద్య ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్‌లో నాయకత్వ లక్షణాలు ఎలా రూపుదిద్దుకోవాలో గురించి సూచనలు ఇచ్చారు.డా. నర్సయ్య గారు తమ ప్రసంగంలో కాలేజ్ జీవిత విలువను వివరించడంతో పాటు, విద్యార్థులు తమ కాలేజీ రోజుల్ని ఎప్పటికీ మరిచిపోకూడదని గుర్తుచేశారు. అంతేకాకుండా, ఆరిస్టాటిల్ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. ఎల్. శ్రీనివాస్ రెడ్డి అందించిన మూల్యమైన ప్రసంగం, అందరికీ ప్రేరణగా నిలిచింది. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడంలో నైతికత, పట్టుదల మరియు సమాజం పట్ల బాధ్యత చాలా ముఖ్యమని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు వెలుగులు నింపాలని ఆశిస్తూ, ముఖ్యమైన సూచనలతో ప్రసంగం ముగించారు. జూనియర్ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా: నృత్య ప్రదర్శనలు, వినోదాత్మక ఆటలు,ర్యాంప్ వాక్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం చివరికి భావోద్వేగ భరితంగా ముగిసింది. విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు మరియు సహపాఠులకు ధన్యవాదాలు తెలిపారు. ఇది జ్ఞాపకాలతో నిండిన ఓ అద్భుతమైన రోజుగా నిలిచింది. ఈ ఫేర్‌వెల్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది, జూనియర్లు-సీనియర్ల మధ్య బంధాన్ని మరింత బలపరిచింది. కళాశాల యాజమాన్యం ముగింపు విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలిపారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్
- మీర్పేట్‌లో జలమండలి అధికారులతో సమావేశం



**నాచారం, జులై 05 (జనంసాక్షి):** మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్‌లోని ఓల్డ్ మీర్పేట్, శాంతినగర్, అన్నపూర్ణ కాలనీలలో తాగునీటి సరఫరా, తక్కువ పీడన సమస్యలపై కాలనీవాసుల ఫిర్యాదుల నేపథ్యంలో స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ జలమండలి అధికారులతో సమావేశమయ్యారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరిత పరిష్కారం కోసం కృ షి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్, ఏజీఎం వేణుగోపాల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు

**జులై 12 నుంచి 14 వరకు ఘనంగా నిర్వహణ**



**కాప్రా, జులై 05 (జనంసాక్షి):** కాప్రా డివిజన్ గాంధీనగర్‌లో జులై 12న బొడ్రాయి పండుగ, 13న శ్రీ మైసమ్మ, పోచమ్మ, విజయదుర్గమ్మ బోనాలు, 14న పలహారపు బండ్ల ఊరేగింపు నిర్వహించాలని గాంధీనగర్ వెల్ఫేర్, యూత్ అసోసియేషన్ సభ్యులు తీర్మానించారు. సాంప్రదాయ బద్ధంగా, భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవాలని కాలనీవాసులను కోరారు. ఈ సమావేశంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. మహేష్, సభ్యులు ఎమ్. భిక్షపతి, జి. కృష్ణ, జి. సత్యనారాయణ, ఎన్. కుమార్, ఎన్. దశరథ్, నరేందర్, యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జి. సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జి. నర్సింగ్ రావ్, సెక్రటరీ డి. ప్రభాకర్, ట్రెజరర్ జి. రాజు తదితరులు పాల్గొన్నారు.

మత సమరసతకు ప్రతీకగా మొహర్రం ఉత్సవం

## కొడంగల్‌లో పీర్ల దర్శనం, ప్రత్యేక ప్రార్థనలు

**కొడంగల్, జులై 05 (జనంసాక్షి):** కొడంగల్ పట్టణంలోని షా బజార్ పీర్ల మసీదులో హాల్ సాబ్, ఖాసీమ్ దూల్, అలీ అబ్బాస్ పీర్లను మాజీ కౌన్సిలర్ మధు సూదన్ యాదవ్ ఆధ్వర్యంలో రమేశ్ బాబు, రఫీక్, శివారెడ్డి, మొగులప్ప, సతీష్ దర్శించి, పూలు, దట్టి సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు శుభాకాంక్షలు

**శామీర్‌పేటలో బిజెపి నాయకుల సమావేశం**



**శామీర్‌పేట, జులై 05 (జనంసాక్షి):** బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావును బిజెపి జిల్లా నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రమేష్ పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో కెబినెట్ ఇన్‌స్టలేషన్ ఉత్సవం

**విద్యార్థులకు మెడల్స్ అందజేసిన సిఐ రవికుమార్**



**కాప్రా, జులై 05 (జనంసాక్షి):**
కుషాయిగూడలోని నారాయణ పాఠశాలలో శనివారం కెబినెట్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చర్లపల్లి సిఐ రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులను తరగతి వారీగా మానిటర్లుగా ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ, విద్యతో పాటు మంచి ప్రవర్తన, నాయకత్వ లక్షణాలు విద్యార్థులు అలవర్చుకోవాలని, ఆరోగ్యకరమైన పోటీతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సూచించారు. ప్రమాద సమయంలో 100 నంబర్‌కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం పురుషోత్తంరెడ్డి, ప్రిన్సిపల్ అవరజని, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## టీజేఏసీ నేత నేతి శంకర్ ను పరామర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్ జూలై 5 (జనం సాక్షి)** : తెలంగాణ ఉద్యమ నేత, ఆర్యవైశ్య సంఘం నాయకులు నేతి శంకర్ గుప్త అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద లు వేరువేరుగా శనివారం ఆయన ను పరామర్శించారు. ఈ సందర్భంగా నేతి శంకర్ కు మనోధైర్యాన్నిస్తూ త్వరలోనే పూర్తిగా కోలుకోని సంపూర్ణ ఆయురారోగ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కులుకుల జగన్, బి ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, వేణు యాదవ్, వైశ్య సంఘం నాయకులు వార్షి ప్రకాష్ గుప్తా, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ రేగూరి ప్రవీణ్ కుమార్ గుప్తా, తేరాల శ్రీనివాస్ గుప్తా, దుంబాల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు ఆర్కే దయాసాగర్,యాదా నరేందర్ గుప్తా, అంగడి సత్యనారాయణ, పులిగిల్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతు ప్రకటించిన డివైఎఫ్ఐ ,ఐద్వా




**కుత్బుల్లాపూర్ జూలై 5 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెకు డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాలు మద్దతు ప్రకటించాయి. శనివారం కుత్బుల్లాపూర్ మండల కమిటీ సమ్మెకు పూర్తిగా మద్దతు ప్రకటిస్తూ షాపూర్ నగర్ లోని కార్యాలయంలో సమ్మె పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పసుల అంజయ్య, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు నాగరాజు, ఐద్వా మండల అధ్యక్షురాలు స్వాతి లు మాట్లాడుతూ యువతి యువకులు, మహిళలు, నిరుద్యోగులు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల కు వ్యతిరేకంగా పోరాటం చేయవలసిన అవసరం ఉందన్నారు. సార్వత్రిక సమ్మెను కుత్బుల్లాపూర్ ప్రాంతంలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల డివైఎఫ్ఐ కార్యదర్శి ఎండి భాష, యువజన సంఘం నాయకులు సాయికుమార్, బీరయ్య పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను విమర్శించే స్థాయి మెతుకు ఆనంద్‌కు లేదు

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఈ చిల్లర రాజకీయాలు
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేష్ యాదవ్, రాములు యాదవ్



**మర్పల్లి జూలై 05 (జనంసాక్షి) :** ఒక ఎంపీటీసీ స్థాయి నుంచి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గా ఎదిగిన వ్యక్తి గడ్డం ప్రసాద్ కుమార్ ను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కు లేదని, పూర్తిగా అనుభవ రహిత్యం ఉన్నట్లు కనిపి స్తున్నాడని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేష్ యాదవ్, రాములు యాదవ్, రామేశ్వర్ లు అన్నారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నాయకులకు ఎమ్మెల్యేగా ఆయన సేవలందిస్తూ స్పీకర్గా విధులు అందజేసేందుకు అన్ని విధాలుగా వీలుంటుందని వారన్నారు. స్పీకర్ హోదాలో ఉన్న వ్యక్తిపై మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడటం సరికాదని, రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ పాలన పోయి, కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సంవత్సర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర మహిళల అందరికీ ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితంగా కల్పించామని, రైతులందరికీ రైతు భరోసా అందిస్తున్నామని, 500 కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదాని వారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీని చేసామన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఆస్తులు సంపాదించుకోవడం తప్ప ఒకరికి ఆదుకున్న వ్యక్తి ఆనంద్ కాదని అన్నారు. మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులలో ఎవరికి నష్టం జరగకుండా చూస్తామని ఎటు 50 ఫీట్లు తీసుకుంటే జరిగే నష్టాన్ని స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లామని స్పీకర్ నిర్ణయం తుది నిర్ణయం అని, నష్టం జరుగుతే పార్టీ తరఫున ఆదుకోవడానికి మేము సిద్ధమని వారన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దళిత బంధు, బతుకమ్మ చీరలు వంటి పథకాలపై భారీ అవినీతి జరిగిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, ఉప్పరి నాగేష్, సురేష్, వినోద్ స్వామి, రాచన్న అబ్రహం, రతన్ తదితరులు పాల్గొన్నారు.

### స్థానిక ఎన్నికల కోసం బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు : కాంగ్రెస్ నాయకులు

**మర్పల్లి:** రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు లేదని మర్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ యాదవ్, రాములు యాదవ్, రామేశ్వర్ అన్నారు. మర్పల్లి మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.2 లక్షల రుణమాఫీ వంటి హామీలను నెరవేర్చిందని, 60 వేల ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని, స్థానిక ఎన్నికల కోసం ఆనంద్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు వెడల్పు పనుల్లో నష్టం జరగకుండా చూస్తామని, స్పీకర్ నిర్ణయమే తుది నిర్ణయమని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, ఉప్పరి నాగేష్, సురేష్, వినోద్ స్వామి, రతన్ తదితరులు పాల్గొన్నారు.



# బిఎల్‌ఓలకు ఎన్నికల శిక్షణ

- బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన
- జిల్లేడు చౌదరిగూడలో ఓటర్ జాబితా సవరణపై శిక్షణ కార్యక్రమం

**జిల్లేడు చౌదరిగూడ, జులై 06 (జనంసాక్షి):** జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో బూత్ లెవెల్ ఆఫీసర్ల (బి.ఎల్.ఓ) కు ఓటర్ జాబితా సంబంధిత శిక్షణ నిర్వహించారు. ఓటర్ జాబితాలో తప్పుల సవరణ, ఓటర్ల వివరాల మార్పిడి, అనర్హుల తొలగింపు వంటి అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. తాసిల్దార్ జగదీశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డి.ఎల్.ఏంటి ఇమాన్యుల్, ఎలక్షన్ డి.టి. బలవర్ధన్, ఉప తాసిల్దార్ భాస్కర్, ఆర్.ఐ శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు రామస్వామి, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.






# పశువైద్యశాలకు ఫ్రిడ్జ్ అందజేత

### కొండారెడ్డిపల్లిలో బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్ సాయం

**కేశంపేట్, జులై 05 (జనంసాక్షి):** కేశంపేట్ మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామ పశు వైద్యశాలకు బీఆర్ఎస్ యువ నాయకుడు కానం ప్రేమ్ కుమార్ గౌడ్ ఫ్రిడ్జ్ అందజేశారు. మందుల నిల్వ కోసం ఫ్రిడ్జ్ అవసరమని వైద్యుడు రాజు కోరడంతో ప్రేమ్ కుమార్ స్పందించారు. ఈ సాయాన్ని గ్రామస్తులు, రైతులు అభినందించారు. కార్యక్రమంలో దశరథ్, మల్లయ్య, మహమ్మద్, కర్నే కోట నరేష్, ఖాజా పాషా, ఉరడి శ్రీనివాస్, మంద కుమార్, చాకలి సత్యం, సాబేర్, అరవింద్, మాధవులు, శ్రీశైలం, ఆసిఫ్ పాల్గొన్నారు.



# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్ రావు ప్రమాణ స్వీకారం

### తార్నాకలో ఘనంగా బాధ్యతల స్వీకరణ

బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. తార్నాకలోని ఆయన నివాసం వద్ద అభిమానులు, బీజేపీ కార్యకర్తలు భారీగా గుమిగూడి శుభాకాంక్షలు తెలిపారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం రాంచందర్ రావు భారీ ర్యాలీతో ఉస్మానియా యూనివర్సిటీ సరస్వతి దేవాలయం, చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాల్లో పూజలు నిర్వహించనున్నారు.

# అందని గ్యాస్ రాయితీ

- మహాలక్ష్మి పథకంలో గ్యాస్ రాయితీ అందక మేడ్చల్ జిల్లాలో లబ్ధిదారుల నిరాశ
- మార్చి నుంచి జూన్ వరకు రాయితీ నగదు జమ కాకపోవడంతో ఎదురుచూపులు



**నాచారం, జులై 05 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగమైన మహాలక్ష్మి పథకం అమలులో లోపాలతో ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించే ఈ పథకం సరిగా అమలు కావడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. పథకం ప్రారంభమైన తొలి నెలల్లో కొంతమంది లబ్ధిదారుల ఖాతాల్లో రాయితీ నగదు జమ అయినప్పటికీ, మార్చి నుంచి జూన్ వరకు రాయితీ నగదు జమ కాలేదని, ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరికి మాత్రమే రాయితీ అందిందని వారు పేర్కొంటున్నారు.

అధికారులను సంప్రదించినా, గ్యాస్ రాయితీపై సమాచారం లేదని సమాధానం ఇవ్వడం లబ్ధిదారులను మరింత నిరాశకు గురిచేస్తోంది. ఈ పరిస్థితి వల్ల పథకం ప్రయోజనం లబ్ధిదారులకు అందక, మహిళలకు ఒరిగిందేమీ లేదని వాపోతున్నారు. జిల్లాలో మహాలక్ష్మి పథకం కింద 1,90,900 మంది లబ్ధిదారులు ఉండగా, 6,11,118 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.874 ఉండగా, రాయితీ కేవలం కొన్ని నెలలు మాత్రమే అందినట్లు లబ్ధిదారులు తెలిపారు.

### ప్రభుత్వంపై ప్రజల నుంచి ఆరోపణలు

మహాలక్ష్మి పథకంతో పాటు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం, రేషన్ కార్డుల జారీ వంటి ఇతర పథకాల అమలులోనూ ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పథకాలు ప్రకటించడం జరిగినా, వాటి అమలుపై దృష్టి సారించకపోవడంతో లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదని అంటున్నారు. ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చి, ఎంపిక చేసిన లబ్ధిదారులకు రాయితీలు, సాయం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

### కాంగ్రెస్ హామీలపై విమర్శలు

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కు గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఉచిత బస్సు పథకాన్ని విజయవంతంగా అమలు చేసినప్పటికీ, గ్యాస్ సిలిండర్ రాయితీ మరియు నగదు సాయం వంటి ఇతర హామీలు అరకొరగా అమలవుతున్నాయని సూచిస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ముఖరా కే గ్రామస్తులు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో మోసం చేసిందని, రూ.2,500 నగదు సాయం, రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి హామీలు నెరవేరలేదని ఆరోపిస్తూ ఇంటింటికీ బోర్డులు పెట్టారు.

### ప్రభుత్వం చర్యలు

మహాలక్ష్మి పథకం కింద రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను 2024 ఫిబ్రవరి 27న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అయితే, తెల్ల రేషన్ కార్డు ఉన్న 90 లక్షల మందికి రాయితీ ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ, కేవలం 40 లక్షల మందికి మాత్రమే ప్రయోజనం కల్పిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించి, పథకాలను సక్రమంగా అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

